క్లుప్తంగా

గొల్లగూడెం ఎంపీటీసీ రాజీనామా

అశ్వాపురం: మండలంలోని గొల్లగూడెం ఎంపీటీసీ ఏనిక రవిబాబు బీఆర్ఎస్ పార్టీకి శనివారం రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా పత్రాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా విడుదల చేశారు. బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి చేస్తున్న రాజీనామాను ఆమోదించాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను కోరారు.

సమస్యలపై స్పందించండి



మాట్లాడుతున్న ఎంపీపీ పార్వతి

చంద్రుగొండ : ప్రజల సమస్యలపై సత్వరమే స్పందించాలని ఎంపీపీ బాణోత్ పార్వతి అధికారులకు సూచించారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలు, శాఖల పనితీరును చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జి.రేవతి, జెడ్పీ కోఆప్షన్‌ సభ్యుడు ఎస్డీ.రసూల్, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సారపాకలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి

బూర్గంపాడు: పారిశ్రామిక ప్రాంతమైన సారపాకలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు పున్నంచంద్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సుమారు 30 వేలమంది జనాభా ఉన్న సారపాకలో పీహెచ్‌సీ లేకపోవటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రజల అవసరాలను గుర్తించి పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని కోరారు.

భోజన కార్మికుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

దుమ్ముగూడెం: ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్భాటంగా ప్రారంభించిన బ్రేక్‌ఫాస్ పథకానికి సంబంధించి ఒక్కొక్క విద్యార్థికి రూ.50 చెల్లించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు మండల విద్యాశాఖ కార్యాలయంలో శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం కార్మికుల జిల్లా అధ్యక్షురాలు జి.పద్మ మాట్లాడుతూ.. బయట బ్రేక్‌ఫాస్ట్ చేయడానికి కనీసం రూ.50 అవుతుండగా, కేవలం 10 రూపాయల 10 పైసలు ఇస్తే ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా చార్జీలు ఎందుకు పెంచడం లేదని ఆమె ప్రశ్నించారు. మెనూకు తగ్గట్లుగా పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, వంటగ్యాస్, కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని, కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యాక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కొర్సా చిలకమ్మ, జిల్లా కమిటీ సభ్యురాలు నిమ్మల మధు, కార్మికులు చిన్నక్క, కుమారి, చెల్లెమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

చంద్రుగొండ: మండలంలోని రేపల్లెవాడ పంచాయతీ శ్రీరాంపురం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన 20 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఎంపీపీ బాణోత్ పార్వతి, సీనియర్ నాయకుడు భోజ్యానాయక్ వారిని కండువాలు కప్పి పార్టీలోకి సాదారంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కిలారి సుదర్శన్, కన్నమాల కృష్ణయ్య, దాసరి వెంకటేశ్వర్లు, బాబురావు పాల్గొన్నారు.

భద్రాచలంలో సీపీఐ కీలకం



మాట్లాడుతున్న రాంప్రసాద్

చర్ల: భద్రాచలం నియోజకవర్గంలో ఏ పార్టీకి చెందిన అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలవాలన్నా సీపీఐ పార్టీయే కీలకమని, నియోజకవర్గంలో ఎన్నికలకు సంబంధించి గెలుపోటములను శాసించే శక్తి సీపీఐకి ఉందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రావులపల్లి రాంప్రసాద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి నూపా పోతయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు కల్లూరి వెంకటేశ్వరావు, జిల్లా సమితి సభ్యులు అడ్డగర్ల తాతాజీ, నాయకులు తెల్లం లక్ష్మీనారాయణ, కారం సమ్మయ్య, పాలంచ రామారావు, శ్యామల పద్మ, నానిపల్లి భద్రం పాల్గొన్నారు.

మణుగూరు పట్టణంలో పూల కొనుగోలు దృశ్యాలు







సద్దులకు సర్వం సిద్ధం

పూల పండుగ జరుపుకునేందుకు రెడీ..

- నేడు బతుకమ్మను సాగనంపనున్న ఆడపడుచులు
- జోరుగా సాగుతున్న పూల విక్రయాలు
- సింగరేణి, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి



వేడుకలకు సిద్ధమైన భద్రాద్రి స్టేడియం

మణుగూరు టౌన్: తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ పండుగ చివరి రోజైన సద్దుల బతుకమ్మను ఘనంగా నిర్వహించేందుకు పల్లెలు, పట్టణాలు సిద్ధమయ్యాయి. ప్రతీ ఏటా మాదిరిగానే ఈ ఏడాది సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు సింగరేణి, మణుగూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయగా, ఆడపడుచులు బతుకమ్మ వేడుకలకు తీరొక్కపూలు కొనుగోలు చేస్తూ సిద్ధమవుతున్నారు. మార్కెట్‌లోనూ రకరకాల పూలు విక్రయదారులు సిద్ధంగా ఉంచారు. ఈ నెల 14వ తేదీ నుంచి ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమైన బతుకమ్మ వేడుకలు నేటితో ముగియనుండటంతో ఈ ఏడాది మరింత వైభవంగా జరుపుకునేందుకు ఆడపడుచులు, మహిళలు ఏర్పాట్లు చేస్తున్నారు. అధికారులు బతుకమ్మ ఆడేందుకు స్థల శుభ్రతతో పాటు నిమజ్జనానికి తగిన సదుపాయాలు కల్పించి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

జోరుగా పూల విక్రయాలు

పూలనే దేవతగా కొలిచే గొప్ప సంస్కృతి బతుకమ్మల ఉండగా, విశ్వవ్యాపితమైన బతుకమ్మ చివరి రోజైన సద్దుల బతుకమ్మను వైభవంగా నిర్వహించేందుకు మణుగూరు పట్టణంలో పూల విక్రయాలు జోరందుకున్నాయి. మార్కెట్‌లో బంతిపూలు, తంగేడు, మందారం, తామరపువ్వు, రుద్రాక్షపూలు, గునుగు, బీరపువ్వు తదితర పూలను మార్కెట్‌లో విక్రయదారులు సిద్ధంగా ఉంచగా, మహిళలు, యువతులు బతుకమ్మలకు కావాల్సిన పూలు సమకూర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. దీంతో పట్టణంలో బంతిపూల రాశులు దర్శనమిస్తుండటంతో అక్కడ కొనుగోలు దారుల సందడితో బతుకమ్మ పండుగ శోభ సంతరించుకున్నది.

ఏర్పాట్లు పూర్తి..

సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో నివసించే కార్మిక కుటుంబాల కోసం భద్రాద్రి స్టేడియంలో నిర్వహించే సద్దుల బతుకమ్మ నిర్వహణకు మైదానాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. రంగు రంగుల పూలను త్రికోణాకారంలో పేర్చి బతుకమ్మల చుట్టూ చప్పట్లు చరుస్తూ వలయాకారంలో తిరిగేందుకు వీలుగా మైదానంలో రంగులద్దారు. మహిళలకు, యువతులకు బతుకమ్మ ఆట-పాటల పోటీలు నిర్వహించడంతో పాటు సింగరేణి కమిటీ ఆధ్వర్యంలో సహజ సిద్ధమైన అందంగా తీర్చిదిద్దిన ఉత్తమ బతుకమ్మలను ఎంపికచేసి బహుమతులు అందజేయనున్నారు. మున్సిపాలిటీలోని నాయుడుకుంట ట్యాంక్‌బండ్‌తో పాటు సమితిసింగారంలోని చెరువు ముందు సింగారం చెరువుతో పాటు చెరువులు, కుంటల వద్ద అధికారుల ఆధ్వర్యంలో దగదగలాడే విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. పట్టణంతో పాటు మండలంలోని అన్ని పంచాయతీల్లో కూడళ్ల వద్ద వినతుల మేరకు విద్యుదీపాలు, వాగులు వద్ద నిమజ్జనానికి ఏర్పాటు చేయగా, బతుకమ్మ ఆడే ప్రాంతాలు కాంతులతో ప్రకాశవంతంగా దర్శనమిస్తున్నాయి.

మల్లంపల్లి నుంచి తీసుకొస్తాం..



ఏటా ములుగు జిల్లా మల్లంపల్లి మండలం నుంచి పూలు తెచ్చి అందుబాటులో ఉంచుతాం. చివరి రోజైన సద్దుల బతుకమ్మకే పూలు ఎక్కువ విక్రయాలు జరుగుతాయి. పీవీకాలనీతో పాటు మార్కెట్‌లో మూడు చోట్ల వివిధ రకాల పూలు తెచ్చి అందుబాటులో ఉంచుతూ విక్రయిస్తున్నాం. గతేడాది కంటే ఈ ఏడాది కొంత లాభసాటిగా ఉంది.

– దశరథం, విక్రయదారుడు

విజయవాడ నుంచి తెచ్చి అమ్ముతాం



విజయవాడతో పాటు ఏన్కూరు ఇతర ప్రాంతాల నుంచి మార్కెట్‌లోకి పూలు తెచ్చి విక్రయిస్తున్నాం. కేజీ రూ.100 ఇంతకుముందు కంటే ఈ ఏడాది ఎక్కువగా కొంటున్నారు. నేడు సద్దుల బతుకమ్మ కావడంతో ఈ రోజు అధికంగా వస్తున్నారు.

– సుభద్ర, అమ్మకందారురాలు

వైభవంగా బతుకమ్మ



మణుగూరులో బతుకమ్మ పండుగ ప్రారంభం నుంచి వాడవాడల్లో ఘనంగా నిర్వహించుకుంటాం. సింగరేణి ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మతో పాటు దసరా రామ్‌లీలా వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసి ప్రోత్సాహక బహుమతులు అందిస్తారు. మార్కెట్‌లో అన్నిరకాల పూలు అందుబాటులోకి తెచ్చారు. అనాదిగా వస్తున్న ఆచారాన్ని

– లక్ష్మి, మణుగూరు

అమరుల త్యాగాలు చిరస్మరణీయం



అశ్వారావుపేటరూరల్: నివాళులర్పిస్తున్న సీఐ, ఎస్సైలు పోలీస్ సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: దేశ, ప్రజల రక్షణ కోసం పోలీసులు చేసే త్యాగాలు వెలకట్టలేనివని, అమర వీరుల త్యాగాలు చిరస్మరణీయమని సీఐ కరుణాకర్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో అమరవీరుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరులకు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు పి. శ్రీకాంత్, శివరామకృష్ణ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం



మాట్లాడుతున్న నాయకులు

భద్రాచలంటౌన్: తెలంగాణ రాష్ట్రంలో రెండు సార్లు అధికారం చేపట్టిన సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో పూర్తి స్థాయిలో విఫలమయ్యారని టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు సరెళ్ల నరేష్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగిన ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో నిరుద్యోగులకు ఉద్యోగ నియామకాలు చేపట్టలేదు కానీ, మంత్రి పదవులతో పూర్తి స్థాయిలో వారి కుటుంబంలో నియామకాలు జరిగాయని ఆరోపించారు. ఈ సమావేశంలో వెంకటేష్, సుధీర్, ప్రదీప్, రాము, శ్యామ్, రాంప్రసాద్, వరుణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యం

ములకలపల్లి: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే ప్రధాన లక్ష్యమని యూత్ కాంగ్రెస్ అశ్వారావుపేట నియోజకవర్గ అధ్యక్షుడు కోరంపల్లి చెన్నారావు, మండల యూత్ అధ్యక్షుడు ఎండీ.జహీరుద్దీన్ అన్నారు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో శనివారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ అభ్యర్థికి టికెట్ కేటాయించినా సమష్టిగా ముందుకు సాగి, విజయ తీరాలకు చేర్చడమే ఆశయమన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

చర్ల రూరల్: ఏజెన్సీ గ్రామాల్లో నివసించే ప్రజలు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సందీప్ అన్నారు. శనివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని గన్నవరం కాలనీలో వైద్య శిబిరం నిర్వహించారు. 134 మందికి వైద్య పరీక్షలు నిర్వహించిన వారిలో ఆరుగురికి మలేరియా, టైఫాయిడ్, డెంగీ పరీక్షల నిమిత్తం రక్తం సేకరించి లేబరేటరీకి పంపినట్లు వైద్యులు తెలిపారు. వైద్య శిబిరంలో సూపర్‌వైజర్ రాం ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ ధర్మ, ఎల్‌టి.రవి, ఆశా కార్యకర్త ఇందుమతి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ శ్రీలత

బూర్గంపాడు: క్రీడా నైపుణ్యాలను మెరుగుపరుచుకుని గ్రామీణ క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలని జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత ఆకాంక్షించారు. మోరంపల్లిబంజరలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని గ్రామాల్లో క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేసి క్రీడాసామగ్రిని అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేడం లక్ష్మీనారాయణరెడ్డి, కైపు సుబ్బరామిరెడ్డి, కామిరెడ్డి రామకొండారెడ్డి, ఖగేందర్‌రెడ్డి, పేరం రామిరెడ్డి, బత్తుల రామకొండారెడ్డి, మూల బాలిరెడ్డి, చేతుల పెద్దవీర్రాజు, గడ్డం సతీష్, గాదె నర్సిరెడ్డి, కైపు నాగిరెడ్డి, సెనగ అప్పారావు, పాండు చిట్టిబాబు, మూల చిన్న ఆదిరెడ్డి పాల్గొన్నారు.

వామపక్షాల అభ్యర్థుల గెలుపునకు కృషి

భద్రాచలంఅర్బన్: కార్మిక పోరాటాలకు అండగా నిలుస్తున్న వామపక్ష అభ్యర్థులు, వారు బలపరిచిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్ అన్నారు. ఈ మేరకు శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రకటించిన మేనిఫెస్టోలో వివిధ రంగాల కార్మికులు, ఉద్యోగులు సమస్యలకు సంబంధించి పేర్కొనకపోవడం విచారకరమన్నారు. కనీస వేతన చట్టం ప్రకారం రూ.26,000లు నిర్ణయించాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, చట్టబద్ధత సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంబి.నర్సారెడ్డి, నాయకులు జి.లక్ష్మీకాంత్, పి.సంతోష్, అప్పారి రాము, అజయ్ కుమార్, పిలకా శివకుమారి, కోమల, పాప, నాగమణి, వేణి, చంద్రలీల, లీలావతి, విద్యా కుమారి, రోజా, శ్యామల, రమా, కృష్ణ, వెంకటరమణ, కుమారి, అలివేలు, వెంకట నరసమ్మ, పార్వతి, కిషోర్, ఆది, సాంబ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఘాట్ పరిశీలన

చంద్రుగొండ : మండలకేంద్రం చంద్రుగొండలోని గంటే వీరయ్యకుంట వద్ద ఏర్పాటు చేసిన బతుకమ్మ ఘాట్‌ను ఎంపీడీఓ జి.రేవతి శనివారం పరిశీలించారు. బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా సదుపాయాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

'ఉచిత విద్యుత్' పేరిట మోసం

దుమ్ముగూడెం: 24 గంటలు ఉచిత విద్యుత్ ఇస్తున్నామంటూ సీఎం కేసీఆర్ రైతులను మోసం చేస్తున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్ అన్నారు. దుమ్ముగూడెం మండలంలోని రామారావుపేటలో శనివారం జిల్లా నాయకులు మర్మం చంద్రయ్య అధ్యక్షతన పార్టీ మండల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు ముందే మొహం చాటేయ్యడంతో రైతులు సాగు చేసిన పంటలకు సాగునీరు అందక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గంట గంటకు కరెంట్ సరఫరా నిలిచిపోతోందని, రాత్రి వేళల్లో కొన్ని గ్రామాలకు కేవలం 9 గంటలు మాత్రమే విద్యుత్ ఇస్తున్నారన్నారు. సరఫరాలో అంతరాయాలను నియంత్రించి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కురసం రామచిట్టి, తామ బుజ్జి, కురసం వెంకటేష్, కురసం బాలయ్య, సోంది వెంకటేష్, సోంది వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం..



అశ్వాపురం: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రేగా



దమ్మపేట: ఎమ్మెల్యే సమక్షంలో చేరికలు..

అశ్వాపురం: ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, బీఆర్ఎస్‌ను రానున్న ఎన్నికల్లో గెలిపించాలని ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మండలంలోని గొందిగూడెం గ్రామానికి చెందిన పలు కుటుంబాలు శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరాయి. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, నాయకులు వెన్న అశోక్, చిట్టెమ్మ, బొర్రా శ్రీను, మడకం సాధు, సూరిబాబు, కలేటి నర్సింహారావు, కోర్సం నర్సింహారావు, కాటిబోయిన గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: మండలంలోని తాటిసుబ్బన్నగూడెం గ్రామంలోని, ఎమ్మెల్యే నివాసంలో అశ్వారావుపేట మండల పరిధిలోని బచ్చువారిగూడెం,జెట్టివారి గుంపు, ఆశవారిగుంపు, వాగొడ్డుగూడెం, పెద్దకాపు గుంపు గ్రామాల పలు కుటుంబాలు ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరాయి. వారికి ఎమ్మెల్యే పార్టీ కండవా కప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో జెట్టి భద్రమమ, పద్మ, కొమరం ముత్తమ్మ, లక్ష్మి, జెట్టి సాంబ, లక్ష్మణరావు, సీత తదితరులు ఉన్నారు.

పాలకపక్షాలను గద్దె దింపాలి



మాట్లాడుతున్న అన్నవరపు కనకయ్య

ములకలపల్లి: దేశ, రాష్ట్రాన్ని పాలిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్‌లకు చరమగీతం పాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పొడియం వెంకటేశ్వర్లు అధ్యక్షతన శనివారం జరిగిన మండలకమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. కేంద్రంలో పాలిస్తున్న బీజేపీ మతోన్మాదాన్ని ఎజెండాగా చేసుకొని, సంపన్నవర్గాలకు లబ్ధిచేకూరేలా పాలన సాగిస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ అమలు సాధ్యంకాని హామీలిస్తూ, ప్రజలను మోసం చేస్తోందని, మాయమాటలతో మరోమారు గద్దెనెక్కేందుకు కృషి చేస్తోందన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, ఊకంటి రవికుమార్, గౌరి నాగేశ్వరరావు, గొగ్గెల ఆదినారాయణ, గోపగాని లక్ష్మీనర్సు, కుంజా రామ్మూర్తి, తిరుపతమ్మ, డిష్ రాంబాబు పాల్గొన్నారు.

అనుచిత పోస్టులు పెడితే చర్యలు



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

చంద్రుగొండ: సామాజిక మాధ్యమాల్లో రాజకీయపరంగా వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు, వీడియోలు పోస్టులు పెడితే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని జూలూరుపాడు సీఐ ఎం. శ్రీనివాసరావు హెచ్చరించారు. చంద్రుగొండ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఎన్నికల నియమావళిపై రాజకీయ నాయకులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గించే పోస్టులపై బాధ్యులను చేస్తూ గ్రూప్ అడ్మిన్‌పై ఏ1 కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్సై మాచినేని రవి, ఎంపీపీ బాణోత్ పార్వతి, వైస్ ఎంపీపీ నరుకుళ్ల సత్యనారాయణ, నాయకులు భోజ్యానాయక్, దార వెంకటేశ్వరరావు, నల్లమోతు రమణ, కృష్ణారెడ్డి, ఏడుకొండలు, ఎస్డీ రసూల్, దారం గోవిందరెడ్డి, సూరా వెంకటేశ్వర్లు, భూపతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



దుమ్ముగూడెం: లక్ష్మీనగరంలో అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు



అశ్వారావుపేటరూరల్: శ్రీలలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో..



అన్నపురెడ్డిపల్లి: ఐశ్వర్యలక్ష్మి అలంకారంలో..

అశ్వారావుపేటరూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో ముస్తాబు చేశారు. స్థానిక మద్దిరావమ్మ గుడి సెంటర్లో ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకొని పూజలు చేసి, అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు.

ఐశ్వర్య లక్ష్మిగా..

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు ఐశ్వర్య లక్ష్మి రూపంలో దర్శనమిచ్చారు. శివాలయంలో అమ్మవారిని మహిషాసుర మర్దినిగా అలంకరించారు. అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

అన్నపూర్ణ అలంకారంలో..

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరంలోం శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో అమ్మవారు అన్నపూర్ణ అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మణుగూరు టౌన్: పట్టణంలోని సుందరయ్యనగర్‌లోని శ్రీ కనకదుర్గ అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. వైస్ ఎంపీపీ కేవిరావు, సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

మణుగూరు రూరల్ : మండలంలోని పైలట్‌కాలనీ కాళీమాత, గుట్టమల్లారంలోని శ్రీపంచముఖ వేద గాయత్రీదేవి, సీఎస్పీ కాటా వద్ద గల కనకదుర్గ, సుందరయ్యనగర్, భగత్‌సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారు ఏడో రోజు లలితాత్రిపుర సుందరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

సుందరయ్యనగర్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండలపంలో ఎమ్మెల్యే రేగా కాంతారావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ వారు భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.



మణుగూరు రూరల్ : లలితా త్రిపుర సుందరీదేవిగా..



మణుగూరు టౌన్: అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే పాయం